# 'దేవుడు'కు విపరీతార్థాలు తీయకండి! శాపనార్థాలూ పెట్టకండి! విశ్వాసం దేవుడు!

## -మీ సిద్ధాంతాలకు పులుస్టాపులు పెట్టండి!!-



ఈ మధ్య సాయి దేవుడు కాదు! అంటూ చిత్రవిచిత్ర కథనాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రతి ప్రకటనలు వెలువడ్తున్నాయి. మంచి జరిగే ప్రతీ క్షేత్రాన్నీ దైవక్షేత్రంగా భావిస్తాం. మంచి చేసేవారినీ మంచిగ మన కోరికను తీర్చేవారినీ దేవుడంటాం. భారతీయంలో చెట్టూచేమా, పుట్టా గుట్టా కొండాకోనా, శిశువూ పశువు (గోవూ) నరుడూ, వానరుడూ, విషభూయిష్టమైన నాగుపామూ– అన్నీ దైవరూపాలే! ప్రకృతీ, సంస్కృతీ– అన్నిటినీ దైవరూపములుగానే ఆరాధిస్తున్నాం. నేలా నింగీ, వాయువు, అగ్నిలను కూడా దైవీ సంపదగా ఆరాధిస్తున్నాం ప్రకృతిలో కృతమైన వన్నీ దైవస్వరూపాలే! ఎందరో దేవుళ్లు, ఎన్నో నామములు! సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి– ఏ దేవతను పూజించినా అది ఒకే దైవానికి చెందుతుందన్నారు. సకల చరాచర జగత్తును ఆరాధించే సౌమ్య స్వభావాన్ని మన పూర్వధర్మమే (సనాతన ధర్మం) మనకు కల్పించింది. నీవు భక్తి ప్రపత్తులతో ఆరాధించు– నే నొచ్చి ఆదుకుంటాను. అభీష్టం తీరుస్తానన్నాడు – భారతీయ ఆరాధనందుకునే ఔదార్యగుణ పరంధాముడు. విశ్వాసం గలిగి ఉండమన్నాడు.

**ఓ భార్య పెళ్ళిరోజున భర్తతో ముచ్చటిస్తూ నిజంగా దేవుడున్నాడు సుమండీ– అన్నది. ఎలా చెప్పగలుగుతున్నావని భర్త అడిగాడు. చూడండీ! ఒకరిపై నొకరికి పీక నులిమి చంపేయాలన్నంత కోపం కలిగినప్పటికినీ నలభై సంవత్సరాలుగా మనం కలిసి కాపురం చేసామంటే దేవుడున్నట్టే కదండీ! అన్నది.**

పరమాత్మను విశ్వసించే భారతదేశంలో మహమ్మద్ ప్రవక్తను దైవంగా 'ముస్లిములూ, ఏసుక్రీస్తు, మేరీమాతలను దైవంగా క్రైస్తవులూ, జైన్ మహావీరుణ్ణి జైనులూ, గురునానక్‌ను శిఖ్ఖులూ– ఇలా ఇలా పలుమతములవారు వారి విశ్వాసంతో ఆరాధిస్తున్నారు. ఇహ హైందవ విశ్వాసకులు 'గురుర్ బ్రహ్మ, గురుర్ విష్ణో – గురుర్ దేవో మహేశ్వరా! – అంటూ త్రిమూర్తులనూ, త్రిమూర్తులను ఆరాధించే పలువురు గురువులనూ ఆరాధిస్తున్నారు. ఆ గురుపరంపరలోనే పలు గురువులు





**బా- అంటే తల్లి! -బా- అంటే తండ్రి!**
**తల్లీ - తండ్రివి నీవేనయా సాయీ!**
**నీ ప్రేమ లేకుంటే- నే నొంటరినే - సాయీ!**
**నీవు కలలో నైనా రాకుంటే**
**నా మనసుకు శాంతి ఉండదు!!**
**నా జీవనయానంలో దిశానిర్దేశం చేసేవాడవు నీవే!**
**నిను ప్రార్థించని- జీవితం వ్యర్థము అర్థరహితము!**
**నీ అనుగ్రహం లేకుంటే సువాసనలేని**
**కాగిత పూవులం!**

**నీవే కరుణించకపోతే-**
**గాలివాటు కెగిరే గాలిపటాలం!**
**సాయి! అంటే ఓయీ అను**
**బాబా! అంటే 'బా' 'బా' అను -**
**విన్నావని నా విశ్వాసము చెబుతుంది!**
**కనుచున్నావనే విశ్వాసమూ పెరుగుతుంది!**
**ఇలా ఇలా 'శ్రద్ధ'గ చెబితే, సాయి గురుడెందు**
**కనుగ్రహించడు! అంటుంది మనం!!**
**కౌసల్యా సుప్రజా రాముడైన**
**శ్రీవేంకటేశుడు కలియుగ దైవం!**
**షిర్డీ సాయినాముడు సద్గురుడు - గురుడు!**
**రామరామ సాయీ! సద్గురు నామ సాయీ!**
**- గోటేటి**

వచ్చారు. వారినే గురువే దైవంగా ఆరాధిస్తున్నారు. గురువును దైవంగా ఆరాధించే సంస్కృతి ఉన్నది. ముస్లిముల్లో సిద్ధిపొందిన గురువులకు సమాధి కట్టి ఆరాధించే సాంప్రదాయమున్నది. క్రైస్తవులు చర్చికి వెళ్ళి క్రీస్తునూ, ఫాదర్నూ ఆరాధించే సాంప్రదాయం గ్రామాల్లో ఇప్పటికీ ఉన్నది.

శంకర, రామానుజ, మధ్వాచార్య పరంపరా పీఠాధీశులను గౌరవించి పాదపూజను జరిపే సాంప్రదాయం సాగుతూనే వున్నది. వారు కొందరు గురు పాదుకలనుంచి పూజించమంటారు. తాముగా ఏర్పాటు చేసుకున్న పీఠాధిపతులు తమ పాదాలకే పూజ చేయించుకుంటుంటారు. భక్తులు వారిపై విశ్వాసం ఉంచి పూజ చేస్తూంటారు. భక్తుల విశ్వాసానికే వొదిలేయాలిగాని విమర్శించడం భారత సంస్కృతికి అపచారం.

**ప్రారంభమైన వివాదం షిర్డీసాయిబాబా**

ఆయన ఫకీర్‌గానే జీవిత కాలం జీవించారు. ఫకీర్‌గానే 11 చోట్ల భిక్షాటనం చేసారు. ఆయనెపుడు భవంతులు కోరుకో లేదు. పాదపూజలు చేయించుకోలేదు. సాధారణ ఫకీర్ జీవితమే చివరివరకూ గడిపారు. సాయి భక్తులెపుడూ "సాయిరాం - సాయిరాం' అనే పలుకరించుకుంటారు. శ్రీరామనవమిని సాయి జన్మదినంగా జరుపుకునే సాంప్రదాయం సాయి బాబా జీవించి ఉన్న కాలం నుంచీ ఉన్నది.సాయి సమాధి చెందిన రోజు విజయదశమి రోజునే జరుపుకోవడం ఆచారమైంది. గురుపూర్ణిమరోజున 'సాయి'ని ఆరాధించే ఆచారం ఉన్నది. **అల్లామాలిక్ - అల్లా అచ్ఛాకరేగా'** అనడమనేది ముస్లిము భక్తుల ముచ్చట కోసమే! అబ్దుల్లా బాబా వంటివారు ఆయన్ను దైవంగా ఆరాధించి షిర్డీలోని చావడికెదురుగా సమాధి కాబడ్డారు. ఆయన ప్రేమించినదీ, ఆయన్ను ప్రేమించినదీ వారిలో హైందవ విశ్వాసపరులే యెక్కువ. సాయి అనే పేరు చాందోబా ఆలయ పూజారి మహల్సాపతి పెట్టారుగానీ - ఆయన పెట్టుకోలేదు. బాబా అన్నదీ భక్తులే. శివ, రామ, కృష్ణ ఏ రూపాల్లో కొలిచినప్పటికినీ- వారికి ఆ రూపాలలోనే దర్శనమిచ్చారు. భగవద్గీత శ్లోకాలకు అర్థం చెప్పేవారు, వ్యాఖ్యానం చెప్పేవారు. శిథిలావస్థలో ఉన్న మసీదుకు 'ద్వారకామాయి' పేరు పెట్టారు. నిత్యాగ్ని హోత్రమును ప్రక్కగా పెట్టుకుని - తానే కట్టెలు వేస్తూ ఆ విభూతినే సర్వరోగ సంజీవనిగా యిచ్చేవారు. దీపావళికి జ్యోతులు వెలిగించినట్లు మసీదంతా దీపాలు వెలిగించేవారు. లెండీ తోట నందు మొక్కలను పెంచుతూ, బావిలోని నీటిని తోడి మొక్కలకు పోసేవారు. ఆయన ఏ గిమికీలు చేయలేదు. చినిగిన చొక్కా తక్క, ఏ చీనీచీనాంబరములూ ధరించలేదు. ఆడంబరంగా ఏ పనులూ చేయలేదు. వచ్చే భక్తులు ఎవరి సాంప్రదాయంతో వారు ఆరాధించారు. పాదపూజల కెపుడూ ఆసక్తిని చూపించిన దాఖలాలు లేవు. ఏ అట్ట హాసములు లేని నిరాడంబర వ్యక్తి. ఏ శిష్యవర్గాన్నీ ఆయన పెంచలేదు. సాయికి భక్తులు తక్క శిష్యులు లేరు. ఆయన శ్యామా- మహల్సాపతులతో కలిసి ఒకే పడకపై పడుకునేవారు. శ్రద్ధ, సబూరీలకే ఆయన మొగ్గేవారు. శ్రద్ధ అంటే అనురక్తి, సబూరీ అంటే దక్షిణ. భక్తుడెంత అనుకున్నాడో, అంతే అడిగి తీసుకునేవారు. తీసుకున్న దంతా తిరిగి యిచ్చేవారు. తాత్యా అనేవాణ్ణి తనవానిగా తలిచారు. అతని ప్రాణం కోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టారు. తన అంకిత భక్తుడు బుట్టీ కృష్ణుని కోసం మందిరం నిర్మించి బాబా ప్రారంభించాలని తలి చారు. **తానొకటి తలిస్తే దైవమొకటి** తలచినట్లు భవనం పూర్తియైనప్పుడు బాబాలేరు. ఆయన పార్థివదేహాన్ని ఆ మందిరంలోనే సమాధి చేసారు. ఆ సమాధి నుంచే బాబా భక్తుల ఈప్సితాలను ఈడేరుస్తామన్నారు. అలాగే భక్తులను ఆదుకుంటున్నారు. సజీవిగా ఉన్నపుడు ఆదుకుంటున్నట్లే సమాధి నొందిన అనన్తరం కూడా బాబా తన భక్తులను ఆదుకుంటూనే ఉన్నారు. ఆయన సజీవుడిగా ఉండిన కాలంలో శిథిలావస్థలో ఉన్న మసీదు ద్వారకామాయీ, ఓ వంద అడుగుల్లో ఉన్న చావిడీ, భిక్షకు వెళ్లే ఓ పాత్ర, చేతికర్ర, చినిగిన చొక్కా ఓ లుంగీ పంచె, తలకొక పాగా - తక్క యితర ఆస్తులు లేవు. ఏ సంపదా ఆర్జించ లేదు. ఎక్కడా ఆయనకు ఆరాధనా మందిరముల్లేవు. అపుడే కొందరు ఛాందస మనస్కులు ఆయన్నెదురిస్తూ వచ్చారు. ప్రచ్ఛన్నపోరు సలిపారు. అలా వచ్చినవారం దరూ భంగపడ్డారు. దొంగగా ఆయనపై కేసును కూడా పెట్టారు. ముద్దాయిగా ఆయన కోర్టుకు హాజరయ్యారు. దేనికీ లొంగలేదు. బెంగపడలేదు. నిరాడంబర జీవితం, నిరంతరమూ ఏదో స్మరణం. ఎక్కడెక్కడో ఉన్న భక్తులను కాపాడడం - ఎన్నో రూపాల్లో వెళ్ళడం. ఆయన గుడులూ, గోపురాలూ, మందిరాలు కట్టించమని అడగ లేదు. అంతా భక్తులు వారివారి విశ్వాసంతో ఆరాధించారు. ఆయన ఉండగాగానీ, మరణానన్తరంగానీ ఏ మందిరాలూ వెలయలేదు. ఆయన నిర్మించమనలేదు. ఆ రోజుల్లో రామాలయం లేని గ్రామమెలా లేదో ఈనాడు సాయి మందిరం లేని గ్రామం లేదు. దేశేతర ప్రాంతాల్లో కూడా సాయి మందిరాలు వెలుస్తున్నాయ్. 'సాయి' అంటే 'ఓయీ' అని పలుకుతాడని భక్తుల ప్రగాఢ విశ్వాసమే ఆయన్ను దేవునిగా తలపింపచేసింది.






# చలసాని వేంకటేశ్వరరావు అని వ్రాసేకన్నా జగపతి వేంకటేశ్వరరావు అని వ్రాస్తేనే పలువురి కెరుక!



కొంతమందికి ఎంతో చరిత్ర ఉంటుంది! చైతన్యకర జీవితం ఉంటుంది. చిత్తశుద్ధి ఉంటుంది. జ్ఞానపూర్ణత్వం ఉంటుంది. దయాకరహృదయం ఉంటుంది. దయనీయ గుణం ఉంటుంది. పలు కోణాల్లో సహాయపడుతూంటారు; ఆ పడుతూండడంలో వారూ పడుతుంటారు. పడి కోలుకుంటూంటారు. కోలుకున్న శక్తినంతా పీడిత మనుష్యులకే వినియోగిస్తూంటారు. వారి నెందుకో ప్రచార మాధ్యమం గుర్తించదు. ఆ మాధ్యమం గుర్తించాలని వారు బాధపడరు. వారు చేసే పని ప్రచారానికీ, ప్రసారానికీ కోసం కాదు! ఇవే ఆయన లక్షణాలు.

ఒక అక్టోబరు 2వ తేదీన వారి 'అమ్మా- నాన్న' అనాథాశ్రమ ఉత్సవానికి ఉత్సుకతతో వెళ్ళాను. కంభంపాటి రామమోహనరావు (నేటిమేటి రాజకీయవేత్త) నాటి సభకు అగ్రాసానాధిపత్యం వహించారు. నేను ఆనాడు మేటినికాను. నన్నుకూడా పిలిచి ఖద్దరు పంచెలచాపుతో సత్కరించారు. అప్పట్నుంచీ జగపతి వేంకటేశ్వరరావును పరిశీలిస్తూ వచ్చాను. ఆయన వృత్తి సినిమా థియేటర్ల నిర్వహణ, పాతచిత్రాల కొనుగోలు, కొత్తచిత్రాల పంపిణీ, విఠలాచార్య దర్శకత్వాన 'కనకదుర్గా పూజాఫలం' చిత్రనిర్మాణం. ఆ చిత్ర విడుదల రోజున, నేను అనువదించిన 'నాగమ్మ శపథం' విడుదలై మా చిత్ర నిర్మాణదశకు విరమణం చేయించాయి. కానీ, ఆయన 'అమ్మా- నాన్నా' వృద్ధాశ్రమ పోషణం, వృద్ధి అవుతూనే ఉన్నది. లాభనష్టాలను బేరీజు వేసుకోవడాని కదేంవీ వ్యాపార సంస్థగా తలుపలేదు కదా!

ఆయన 'స్వయంకృత' త్యాగి యని ఒక ద్వంద్వాక్షర పదంతో చెబుతున్నాను. క్రయం చేసిన పాతచిత్రాలనన్నిటినీ విక్రయం చేసారు. ఉన్న ఇల్లును అమ్మివేసారు. తిరుగుతున్న కారును అమ్మివేసారు. తండ్రిగా బాధ్యత వహించి ఇరువురు కుమార్తెలకూ వివాహం చేసి, వారినో అయ్యచేతుల్లో పెట్టారు. ఇక ఇహపరాల కున్న జగపతి ఇంటర్నేషనల్ హోటల్ని కుమారుడికి వ్రాసి యిచ్చేసారు.

వేంకటేశ్వరరావు రచయితను కానంటారు. కానీ ఆయనలో రచయితల సాహిత్య సంపదకు మించిన అక్షఋ సంపద ఉన్నది. అంతర్భావనను ప్రతిబింబపచేసే శక్తి ఉన్నది. ఉత్సుకత ఉన్నది, ఉద్వేగత ఉన్నది. అవి రెండూ హాలాహలకణములే అయినప్పటికినీ నీలకంఠునిలా కంఠములోనే హాలాహలం దాచుకుంటారు.

ఎందరో భూతవర్తమానుల్ని గూర్చి వ్రాస్తున్న నా కలం గళమెత్తి, వేంకటేశ్వరరావుగారూ- మీ ఫోటో బయోడేటాలను పంపండని ఫోనుచేసి మరీ అడిగింది.

సినిమా ప్రపంచం యొక్క 65 ఏండ్ల లోతుపాతు లెరిగిన నేను, ఆయన తన 'తెలుగు సినిమా' 55 ఏండ్ల చరిత్రను వ్రాసి ప్రచురించి ఐలాపురం హోటల్‌లో స్వయంగా నాకు అందజేసినపుడు - వారి సౌజన్యానికి అబ్బురపడ్డాను. గ్రంథం చదివాక - నేనెక్కడ ఉన్నాను. చెన్నపురి హాలీవుడ్‌లో నాలుగు తరాలవారితో సన్నిహితంగా ఉన్న నాకు తెలియని విషయాలెన్ని ఉన్నాయోనని రిత్తవోయాను. చలసానీ! చెల్లని కాణీల వద్ద ఎలా చెలాయించుకు వచ్చావయ్యా అంటూ - ప్రముఖాంధ్ర నిండు నూట యిరవైయేండ్లు జీవించాలని దీవిస్తూ ఆయన ఉత్తరాన్నిందే పొందిపరిచింది:

**శ్రీ గోటేటి శ్రీరామారావుగారికి వెంకటేశ్వరరావు నమస్కారములు!**

తమరు వ్రాసిన ఉత్తరం అందినది చాలా సంతోషము!

'ప్రముఖాంధ్ర' చందాగా నేనేమిస్తున్నాననేది ప్రక్కనపెడితే - వట్టిగా మాత్రం చదవడం లేదనేది గట్టిగా చెప్పగలను.

మీకున్న శక్తిని 'ప్రముఖాంధ్ర'కే వినియోగిస్తున్నారనేది అక్షరసత్యం. ఇందులో మారుమాటలేదు.

మీ అంతటి ప్రముఖ వ్యక్తుల సాంగత్యం భగవంతుడు నాకిచ్చిన వరం!

2013 డిసంబరు 21వ తేదీన మార్నింగ్ వాక్‌లో నాకేం తెలియకనే పడిపోవడంతో ప్రారంభించి విజయవాడలోని పెద్దహాస్పిటల్స్ అన్నింటా వుండవలసి వచ్చింది. మెదడులో నెత్తురు గడ్డ కడితే, దాని ఆపరేషనుతో మొదలై వరుసగా రకరకాల వ్యాధులతో 5 మాసములు అనారోగ్యముతో ఇబ్బందులు పడి పడి ఇప్పుడిప్పుడే కాస్త ఊరట కలిగిస్తున్నది.

ఆశ్రమం అనుభవాలతో "ఆణిముత్యాలు", సినిమా అనుభవంతో 'తెలుగు సినిమా' వ్రాయడం నా శక్తికి మించి కాస్త అనారోగ్యం పాలు చేసిందనుకుంటాను. నాకు సేవా కార్యక్రమాల పిచ్చిపెరిగింది. 50 మంది వృద్ధుల సంరక్షణతోపాటు 40 మంది పేద వృద్ధులకు నెల నెలా క్యాష్ పెన్షన్ ఇస్తున్నాను. మండే ఎండలో నడిచివెళ్ళేవారి కోసం షెల్టరు కట్టించి అక్కడి నుండి కిలో మీటర్ దూరంలో ఉన్న రెండు పేదల కాలనీలకు కారుద్వారా వానుల కొద్దిమంది మాత్రం ఉచిత సర్వీస్‌గా ఏర్పాటు చేస్తున్నాను. జీవితగమ్యం దగ్గరపడుతున్నది. ఇంకా ఏమి చేయలేకపోతున్నాననే అనే తపన వయసు+ ఆరోగ్యం నన్ను ముందుకు నడువనీయడం లేదు. ఇందు పంపుతున్న నా బయోడేటాతోపాటు - నా "తెలుగు సినిమా' పుస్తకంలో ప్రముఖ జర్నలిస్టు ప్రభుగారు చేసిన నా ఇంటర్వ్యూ చూడగలరు. చాలా బాగుంటుంది.

ఇట్టి నా బయోడేటాన్ని, సినిమా పరిశ్రమ గుర్తించలేక పోయినప్పటికీ, మీలాంటి వారి అభిమానమే గుర్తించిందని గొప్పగా భావిస్తాను. ఎక్కువ వ్రాసి మిమ్ము ఇబ్బంది పెట్టాను క్షమించండి. 'అమ్మా - నాన్న' వృద్ధాశ్రమం ద్వారా పురప్రముఖుల గౌరవాన్ని పొందగలిగాను

మీ అభిమాని **చ.వేంకయ్య**

**వేంకటేశ్వరరావు గారూ!**

**'అమ్మా - నాన్నా" సంస్థనొకసారి చూడాలండీ!**


రాబడిని పెంచే లక్ష్మీ స్వరూపమైన

ధర రూ. 400/- మాత్రమే

**లక్ష్మీ గవ్వలు** Lakshmi Gavvalu



లక్ష్మీ గవ్వలు లక్ష్మీ స్వరూపం. ఇందులో లక్ష్మీదేవి నివాసమై ఉంటుందని పురాణాలు ఉద్ఘాటిస్తున్నాయి. ఓ తెల్లని వస్త్రానికి పసుపు పూసి అందులో ఈ లక్ష్మీ గవ్వలను మూటగట్టి ఇంట్లో పెట్టుకుని పూజిస్తే కుటుంబ సభ్యుల మధ్య అభిప్రాయ బేధాలు తొలగి ఒకరికొకరు సహాయ సహకారాన్ని అందించుకుంటూ ఆనందంగా జీవితాన్ని గడుపుతారు. రాబడి పెరుగుతుంది. అనారోగ్యం తొలగుతుంది. వ్యాపార స్థలంలో పెట్టుకుంటే వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. పనివాళ్ళు నుండి మీకు ఎటువంటి ఒత్తిళ్ళుండవు. మీరు కోరిన విధంగా మీపై గౌరవ మర్యాదలతో పనిచేస్తారు. ఉద్యోగస్తులు జేబులో పెట్టుకుంటే తోటి ఉద్యోగస్తులనుండి సమస్యలు రావు. ఈ గవ్వలను తాకి ఏ పని మొదలెట్టినా అది విజయవంతమౌతుంది.

రెంటచింతల్లపల్లి రామలింగ శాస్త్రి

పై పవిత్ర సామగ్రి కావల్సినవారు మాకు ఫోన్ చేసి మీ అడ్రస్ తెలియజేస్తే, పూజ చేసి, పోస్టల్ ఖర్చులు మేమే భరించి వి.పి.పోస్ట్ ద్వారా పంపగలం. మీరు పోస్ట్ మ్యాన్‌కు పైన తెలిపిన అమౌంట్ మాత్రం కట్టి ప్యాకెట్ తీసుకోవచ్చు.

Estd. 1975

:09840259871, 04424837505

BAKTHITODAY PAVITHRA SAAMAGRI PARISODHANA NILAYAM
Balabharathi Nilayam, Post Box No. 2645, New No. 49
Rangarajapuram Main Road, Kodambakkam, Chennai - 600024
www.bakthitoday.blogspot.com ; www.indiamart.com/bakthitoday-pavithra

# కొండకు పోదాం! దేవుణ్ణి చూద్దాం!!

## చలోచలో పాలోపాలోగా వెళ్లే వేంకటేశ్వర దర్శనమా!

మెల్లగా కొండల మెట్లెక్కి ఒకింత సమయం ఓ చెట్టు క్రింద సేద తీరి, చల్లగా వేంకటేశ్వరుని దర్శనం చేసుకొనే రోజులూ– తిరుపతి బస్సునిలయంలో బస్సుయెక్కి అలిపిరి మార్గంలో ఏడుకొండల్లో పోతూన్నపుడు సుందరంగా జాలువారే జలధారలూ, రోడ్డుకిరుప్రక్కల ఉండే జింకలూ, చల్లటి గాలులూగుకుంటూ చెవుల్లో సరిగమ పదనిసలు వినిపిస్తూ, చక్కలిగింతలు పెట్టే 'చలి' గాలి యెక్కడ కెళ్ళిపోయిందో! వెళ్లగానే గది చూచుకొనే సౌభాగ్యం కూడా అక్కడికే పోయింది.



బస్సు తిరుమలకు పోగానే ఊగుకుంటూ కనిపించే రావి వృక్షమూ (ఇంకేదన్నా వృక్షమో తప్పులెంచకండి)– ఆ వృక్ష తిన్నెపై పెట్టేబేడాపెట్టి – ఓ మనిషిని కాపలాగా ఉంచి, ఒక్కరొక్కరే తలనీలాలిచ్చి, అక్కడనే ఉన్న స్నానగదుల్లో స్నానం చేసి – తీరుగా దుకాణాల్ని చూచుకుంటూ పటికబెల్లం పొట్లాలను తీసుకుని వెళ్లమని దారికిరుప్రక్కలా అడ్డుపడుతుంటే, నవ్వు కుంటూ అలా గుడిముందు నుంచీ ఎడమ ప్రక్కనున్న మాడా వీథి గుండా రామమందిరం దాటి వీధి కొసనున్న 'క్యూ' ద్వారా మహద్వార ప్రవేశం చేసి, ఒక్కొక్కప్పుడు ఆలయంలో కూడా రెండు మూడు వందల గజాల 'క్యూ'ను నదీపాయలా ఉండే చుట్టుకువెడుతూన్నపుడు ప్రక్కనే జరుగుతూన్న కళ్యాణోత్సవమునుచూస్తూ – మరో దిశగల శ్రీకృష్ణ దేవరాయల సతీమణుల చూస్తూ, వెండి వాకిటి గుండా ఆలయం ప్రవేశిస్తున్నప్పుడుండే ఉల్లాసమూ, చేతులు పైకెత్తి 'గోవిందా గోవిందా' అనే ఆ నామస్మరణంతో వెళ్లే అవ కాశమూ యిప్పుడు లేదు. వైకుంఠం క్యూ కాంప్లెక్సు వచ్చినపుడే పోయింది. ఆ కాంప్లెక్సులో కాఫీ, ఫలహారములు, శీతలపానీయములు దొరికేవి. ఇపుడు ఊరు చివరి వరకూ ఉండే క్యూలైన్లు, క్రింద చీమా చిట్రా – నాగుపాములే వచ్చి ఇపుడు కాట్లేస్తున్నవి. ఇహముందు వనాంతరములనుండీ చిరుత పులులూ, ఎలుగుబంట్లూ రాకుండా ఉండాలని ప్రార్థిస్తున్నాం.

ఏఁవి విచిత్రమండీ– రెండురోజులు మూడ్రోజులు 'క్యూ'ల్లో బారుతీరిన జనమా? స్నానచట్టుబండలు లేకుండా – శ్రీనివాస దర్శనమా? తిరుచూర్ణం, సాంప్రదాయ దుస్తులు ధరించాలనే ప్రకటనలెందుకు? ఆ రోజుల్లో రాజులు, జమీందారులొచ్చి లక్షలకు లక్షలు యివ్వడానికి అలవాటుపడినందువలనా– రోజువారీగా లక్షలూ, కోట్లు రావడాని కని, డెబ్బై వేలూ, 80 వేల మందికి దర్శనానికి వచ్చారని వార్తాశిఖరులు వ్రాయడమా? ఇరవై, ముప్పైవేలమంది వచ్చినపుడు భక్తులు విశేషంగా లేరనడమా, విచిత్రంగా ఉన్నది.

శ్రీనివాసా! ఏఁవిటి ప్రభూ! ఈ లఘు, మహాలఘు దర్శనములు? నిను రెండు కళ్లతో రెండు సెకనులైనా నిను చూడనీయవా? ఎవరీ జన ఆవేదనను పట్టించుకుంటారు!


నీవు అప్పుడప్పుడాగ్రహించి ప్రమాదాలు సూచి స్తున్నా, అవగాహన చేసుకోని అధికార బృందం ఉంది. నీ పేరు చెప్పి రోజుకు రెండు మూడుకోట్ల సంపాద నంలో ఎంతటి సంపాతకముందో గ్రహించడం లేదు.

**నీవుండేది అక్కడా! నేనుండేది ఇక్కడా!**
**ఏ లీల దర్శింతునో – నా సామి ఏ లీల పూజింతునో–**
**–అని వాపోవడమేనా స్వామి!**
**ఏడుకొండలస్వామీ ఎక్కడున్నావయ్యా–**
**ఎన్నిమెట్లెక్కినా కనపడవేమయ్యా ॥ఏ॥**
**ఏడుకొండస్వామీ**



# దేశప్రజలందరూ మాతృభాషలోనే విద్యాభ్యాసం చేసిననాడు విజ్ఞానవంతులయే అవకాశం ఉన్నది.

## రవీంద్ర కవీంద్రులు వ్రాక్కుచ్చారు



భావసామరస్యం, తమ భావాలను స్వేచ్ఛగా, స్వచ్ఛంగా, సత్యంగా, ధర్మంగా, సాంప్రదాయపరంగా, సారస్వ హృదయం కలిగే జీవన సరళిని మాతృభాష ఒక్కటే నేర్పుతుంది అన్నారు.

**రవీంద్రుడనగానే ఠక్కున స్మరణకు వచ్చేది 'జనగణమన అధినాయక జయహే' అన్న జాతీయగీతం. అలాగతే ఆయన 'సోనార్ బంగ్లా' బంగ్లాదేశ్‌కు జాతీయగీతం రచించారు. బకిమ్ చంద్రచటర్జీ 'వందేమాతరమ్' గీతానికి స్వరకల్పన ఠాగూరే చేసారు. మాతృభాషపై అత్యంత మమకారం ఉండాలని, మాతృభాషలోనే విద్యనభ్యసించాలనెడి మహత్తర సందేశమిచ్చిన రవీంద్రుని గూర్చి ఎంత చెప్పినా కొంతేయవుతుంది.**

దేశీయమైన కళలు, వృత్తులు, సాంప్రదాయములు వంటబట్టడానికి, సత్ప్రవర్తన గల వారిగా తీర్చిదిద్దడానికి మన దేశీయ భాషలు స్వచ్ఛమైన నీతి విశారదలుగా తీర్చిదిద్దే పరిజ్ఞానాన్ని, మన పూర్వులు సిద్ధాంతీకరించి, క్రమ ప్రణాళికను (సిలబస్) తయారించి మార్గదర్శనం చేసారు. బిడ్డ పుట్టినప్పట్నుంచీ తల్లిపాలునే యివ్వమన్నారు. ఆరోగ్యంగా పెరగాలంటే తల్లిపాలే బలిష్టుణ్ణి కావిస్తాయ్. తల్లిపాలవంటిదే తల్లిభాష. పోతపాలును పోసే తల్లులు పెరిగిన తరువాత, కుత్రిమ పాలను త్రావి, పిల్లవాడు తన తల్లి భాషామాధుర్యాన్ని రుచి చూడలేకపోతున్నాడు. పిన్నతనంలోనే 'యా' (యస్‌కు పర్యాయపదం) అంటూండే అంటు రోగానికి మనం కారకులం కాకూడదన్నది విశ్వకవి రవీంద్రుని అభిప్రాయం. 1897 సం॥ములోనే 'నాటోర్'లో జరిగిన రాష్ట్రీయ మహాసభలో కార్యక్రమ వ్యవహారములన్నిటినీ మాతృభాషయైన బెంగాలీ భాషలోనే జరిపించి అందరికీ అవగాహనమయ్యేట్లు చేసారు. రెండేళ్ళ తరువాత 'ఢాకా'లో (బంగ్లాదేశ్)లో జరిగిన రెండవ రాష్ట్రీయ సభలో కూడా రెవరెండ్ కాళీ చరణ్ బెనర్జీ ఆంగ్లోపన్యాసాన్ని చక్కని ధారణామయమైన బెంగాల్ భాషలోనే వినిపించి, అందర్నీ అనందింపచేయడంతో, అప్పటినుంచీ అన్ని సభల్లోనూ 'బెంగాలీ' లోనే మాట్లాడడం ప్రారంభమైంది. నిజానికీ మాతృభాషోద్యం వంగభాషోద్యమంగానే నాందీ స్వరమైంది.

బంగ్లాదేశ్‌లోని జాతీయగీతం, భారతదేశంలోని జాతీయగీతం రవీంద్ర కవీంద్రుని కలం గళముల నుండి ఉద్భవించినవే! భారతదేశపు తొలి నోబుల్ సాహితీ అవార్డు గ్రహీత రవీంద్రుడే! మరల ఎవరూ ఆ సాహితీ స్థానానికి రాలేదు.

గాంధీజీ రవీంద్రునికీ మధ్య ఎన్ని అభిప్రాయ భేదాలున్నప్పటికినీ, పరస్పర గౌరవమర్యాదలు కొనసాగుతూనే ఉండేవి. గాంధీ తలపెట్టిన సహాయ నిరాకరణోద్యమం హింసాత్మక మవుతుందని రవీందుద్రు ముందుగానే ఊహించి, వలదన్నారు. చరఖా కార్యక్రమాన్ని చర్చించడం కోసం రవీంద్రుని వద్దకు గాంధీజీ వచ్చారు. ఈ విషయంలోనూ రవీంద్రుడు విభేదించారు. కానీ రవీంద్రుడు లండన్ వెళ్ళినపుడు గాంధీ నాయకత్వం ఔన్నత్యాన్ని గొప్పగా ప్రశంసిస్తూ మాట్లాడారు. 1940 సం॥ములో గాంధీజీ శాంతి నికేతనానికి వచ్చినప్పుడు– "ఈ శాంతినికేతన్‌కు మీరు సంరక్షునిగా ఉండాలని కోరగా, మీరు స్థాపించిన 'విశ్వ భారతి' జాతీయ సంస్థయని నేనెరుగుదును. ఇది అంత ర్జాతీయ సంస్థగా విఖ్యాతి నొందుతున్నదని వాస్తవం. ఈ సంస్థను సవ్యంగా నడిపే సమిష్ఠి కృషిలో నేను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని గాంధీజీ వాగ్దానం చేసారు. మీరు నిశ్చింతగా ఉండండి అంటూ బాస చేసారు.

ఒకే గూటిలో విద్యా, వివేక సంపన్నతలు ఆశ్రయం పొందిన విశ్వమే విశ్వభారతి. పూర్వం అడవుల్లో గురు కులం పద్ధతుల్లో విద్యనభ్యసింపచేసిన విధానాన్నే రవీంద్రులు అమలుపరిచారు. జాతీయతకు ప్రాధాన్యమిచ్చారు.

దేవేంద్రనాథ్, శారదాదేవి దంపతులకు 1861 సం॥మే 7వ తేదీన రవీంద్రుడు జన్మించాడు. తండ్రి దేవేంద్రనాథ్ తరచు హిమాలయాలకు వెడుతూండేవాడు. చిన్నప్పట్నుంచీ ఆయనిది చక్కని స్వరపేటిక. తండ్రి అబ్బురపడి చక్కని పాటలు పాడించుకుంటూ సంకీర్తనంతో దైవప్రార్థనం చేయించేవాడు. తండ్రి తీరిక వేళల్ని చూచి సంస్కృతం, ఖగోళశాస్త్రం అభ్యసించారు. రవీంద్రుని రచనల్లో సంస్కృతం పాలు ఎక్కువగా కనిపిస్తుంది. చిన్నతనంలోనే కవిత్వం, సంగీతం అలవడింది. పదహారేండ్ల ప్రాయంలో నాటకాల్లో కూడా నటించేవారు. ఐరిష్, ఇంగ్లీషు పాటల్ని కూడా నేర్చుకుని స్వరపరిచేవారు. 'వందే మాతరమ్' గీతానికి కూడా ఆయన స్వరకల్పన చేసారు. అపారమైన దేశభక్తి కల సత్యకాలపు మనిషి. ఆయన రచించిన 'గీతాంజలి' కావ్యానికే ప్రపంచ మెచ్చుకోలు, నోబుల్ బహుమతి లభించింది. సాహిత్యంలో నోబుల్ బహుమతి లభించిన భారత తొలి, మలి సాహితీ వేత్త రవీంద్రులే.

1883 సం॥ములో రవీంద్రునికి మృణాలినీ దేవితో వివాహం జరిగింది. వారిది అనుకూల దాంపత్యం. ఆ అనుకూలత రెండు దశాబ్దాలు పూర్తి కాకుండానే 1902 సం॥ము నవంబరు 13వ తేదీన మృణాలినీ దేవి కన్నుమూసారు. రవీంద్రుని వైవాహిక జీవితంలో అదొక పెద్ద దెబ్బ. ఆయన ఎనలేని దుఃఖాన్ని పొందారు.

తరువాత దేశీయ ప్రేమ, జాతీయ భావ చైతన్యం, విశ్వభారతి స్థాపనం, దాని అభివృద్ధి కొరకూ ఆయన అహరహమూ కృషిచేసిన మహాపురుషుడు. ●

### పరమేశ్వరా!

*భయం లేని మనసు వంచని శిరసు!*
*ఉన్ముక్త జ్ఞానం ఎచట ఉండునో!*
*సంకుచిత భావములతో*
*సమాజమెచ్చట ఛిన్నాభిన్నం కాదో!*
*వాక్కులెచట సత్యపు లోతుల*
*పొరల నుండి వెలువడునో!*
*విరామ మెరుగని కర్మధారలెచట*
*పరిపూర్ణతకై చేతులు చాచునో!*
*వివేకమనెడి నిర్మల ప్రవాహము*
*దురాచారముల మరు భూములలో*
*ఇంకని తావేదో!*
*నీ నేతృత్వంలో మనసు ఎచట*
*సదా క్రమక్రమంగా విస్తరించే*
*ఆలోచనలలో పనులలో*
*నిమగ్నమై యుండునో!*
*అట్టి స్వతంత్ర స్వర్గసీమగా*
*నా దేశం మేలు కొనునుగాక!*

(రవీంద్రుని 'గీతాంజలి'కి
పాతూరి నాగభూషణం తెలుగుసేత)
ఎప్పుడు మేలుకొంటుంది!